


## (దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

### 125

(14‛ ఫిబ్రవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

"మానవులు కొద్దిపాటి పొరపాట్లు చెయ్యడం సహజం" అని సామెత వుందిగదా. వ్యక్తులు అలా చేసే పొరపాట్లలో కొన్నిటివల్ల వారే నష్టపడతారు. కొన్నిటివల్ల అప్రతిష్టపాలవుతారు. కొన్నిటివల్ల ఇతరులు నష్టపడతారు. రోస్టు కూడా ఒకప్పుడు తప్పదు.

ఒకప్పుడు చిన్నచిన్న పొరపాట్లవల్ల కొంత హాస్యంకూడా ఉత్పత్తి అవుతూ వుంటుంది. పోస్టులో ఉత్తరాలు వేయడంలో కొందరి పొరపాట్లు చేస్తూవుంటారు. రెండు మూడు ఉత్తరాలు ఒకేసారి రాసినప్పుడు ఒకరి ఎడ్రసు ఒకరికి వ్రాయడం జరుగుతూ ఉంటుంది. దీనివల్ల కొంత తమాషా జరగడం మామూలు.

మా ఊర్లో ఒక బడిపంతులు ఒకసారి ఊరు వెళ్ళవలసి వచ్చింది. అక్కడనుంచి అనుకున్న తేదీకి రావడం జరగలేదు. అందువల్ల స్కూలు సెక్రటరీకి ఒక ఉత్తరం వ్రాశాడు. భార్యకు కూడా అదే సమయంలో ఉత్తరం వ్రాయడం జరిగింది. తీరా ఎడ్రసులు వ్రాయడంలో తొందరపడి ఒకరిది ఒకరికి వ్రాశాడు.

భార్య ఉత్తరం తీసి చూస్తే "అనివార్యకారణముల వల్ల మరో రెండు రోజులు ఇక్కడ ఆగిపోవలసి వచ్చింది. కనుక దయవుంచి సెలవు యిప్పించగోరుతున్నాను. తమ విధేయుడు - విశ్వనాధరావు" అని వుందిట. అది చదివి "ఈయనకు పరిహాసాలు మరి ఎక్కువ అవుతున్నాయి" అని భార్య నవ్వుకుందట.

స్కూలు సెక్రటరీ ఉత్తరం తీసి చూస్తే ‛ఇదుగో నేను రావడం ఇంకో రెండు రోజులు ఆలస్యమవుతోంది. రేపటికి వస్తానని చెప్పాననుకో కుదరనప్పుడు ఏం చేస్తాం? ఒకప్పుడు వాగ్దానాలు తప్పుతూ వుంటాయి. శుక్రవారం నాడు వచ్చి నువ్వు వేసే శిక్షకి బద్దుణ్ణవుతా. ఉంటానోయ్ వనజారాణి" నీ...వి..వీ...వి....నీ..వి..నాదం" అని వ్రాశాడట.

అది చదివి ఆ సెక్రటరీకి మతిపోయి తర్వాత కొంచెం సేపటికి వళ్ళు మండిపోయి, " ఎవడు ఈ వి...వి...వి..నాధం. తెలిస్తే గొంతు పిసిగేద్దును. డొక్క చీరేద్దును. అయినా ఎప్పటికైనా తెలియకపోతాడా? దస్తూరి పాతదే పట్టుకుంటా వెబాగో" అని రంకెలు పెట్టాడట.

మా మల్లినాథసూరిగారు తాను చేసిన ఒక తమాషా పొరపాటును గురించి చెప్పారు. ఆయన ఒకసారి సతీసమేతంగా ఒకరింటికి పెళ్ళికి వెళ్ళారట. అది అయిదురోజుల పెళ్ళి. పాతకాలపు ఆచారాలు. ఆడవాళ్ళకి ఒకచోటా, మగవాళ్ళకి మరో చోటా వసతులు ఏర్పాటు చేశారుట. రాత్రి ఎనిమిది గంటలైంది. పెళ్ళివారు భోజనానికి బయలుదేరుతున్నారట. మల్లినాధులు ఎప్పుడూ రికామీగా తిరుగుతూ వుండేవారు. పట్టుబట్టలు వగైరాలు వున్న పెట్టె భార్యవద్దనే వుందిట. అవి తెచ్చుకుందామని ఆయనగారు ఆడవాళ్ళున్న గదివైపు వెళ్ళారుట. ఎంతసేపు చూసినా భార్య కనిపించలేదుట. అంతా పట్టుబట్టలు కట్టుకుని బయలుదేరుతున్నారు. మల్లినాధులకు ఎక్కడలేని కోపం వచ్చిందిట.

ఎళ్ళెళ్ళకు వీళ్ళను తీసుకురావడం బుద్ధితక్కువ. వచ్చేదాకా దుంపతెంపుతారు. వచ్చిన తర్వాత కంటికి కనపడరు. తూనీగలల్లే ఎక్కడో ఎగురుతూ వుంటారు. ఈ అయిదురోజులూ ఆటవిడుపుగా భావించి భర్తను మరచిపోతారు - అని సణుగుతూ వెళ్ళి కాళ్ళు కడుక్కుని మళ్ళీ వచ్చారట.

వచ్చేసరికి ఒకామె పెట్టెవద్ద కూర్చుని బట్టలు సర్దుతోందట. గదిలో మరెవరూ లేరట. తన భార్యేననుకుని సరాసరి వెళ్ళి వీపు మీద ఒక దెబ్బవేసి నత్తితో మాట పెగలక... "పె..పె....పెళ్ళికి వస్తే ము...ము...మొగుడకక్కర్లేదా?" అన్నారుట. ఆమె గభాలున వెనక్కి తిరిగి చూసిందట. తీరా చూస్తే ఆయన భార్యకాదు.

మల్లినాథులకు పై ప్రాణాలు పైనే పోయినంతపనట. పొరపాటు అని చెబుదామన్నా నత్తి అడ్డం వచ్చిందట. అందువల్ల పొ...పొ...అంటూనే ఒక్క పరుగు తీశారుట. భోజనానికి వెళ్ళడానికి భయం పుట్టిందట. వెళ్ళి మగవాళ్ళ గదిలో ఒక చాప వేసుకుని పడుకున్నారట.

ఎవరో వచ్చి "తమరు భోజనానికి దయచెయ్యలేదేం?" అంటే ఆయనగారు "ఆకలిగా లేదు. అయినా సామాన్యంగా నేను రాత్రిపూట భోజనం చెయ్యను" అన్నారుట. కానీ ఆకలి బాధలో ఒక ప్రక్క, చేసిన పొరపాటుకు ఒక ప్రక్క రాత్రంతా చెంపలు వేసుకుంటూ జాగారం చెయ్యాల్సి వచ్చిందంట. మర్నాడు తప్పనిసరిగా వెళ్ళి ఫలహారం చేస్తుండగా గత రాత్రి దెబ్బతిన్న ఆవిడ.. "అదుగో ఆయనే" అందిట. ఆ ఫలహారం కూడా వదిలిపెట్టి ఆయన పారిపోయడట.

అలాటి పొరపాట్ల వల్ల అనవసరంగా బాధపడవలసి వస్తూ వుంటుంది. ఒకప్పుడు అవతలవాళ్ళు " ఏదో పాపం పొరపాటున అలా చేశాడు ఎవరికైనా వస్తుందలాంటి పొరపాటు" అని జాలిపడి ఊరుకుంటారు. కొందరు నవ్వుకుని వూరుకుంటారు. కానీ చాలామంది అది తప్పుగా భావించి, పోట్లాటకు తయారవుతారు. జన్మంతా సాధిస్తూనే వుంటారు. అవతలవాళ్ళు తలచుకుని కుళ్ళిపోయేటట్లు.

నేను చదువుకుంటున్న రోజుల్లో పొరపాటుకు చెందిన తమాషా ఒకటి జరిగింది. ఒకసారి వేసవి సెలవల్లో మా వూరునుంచి బందరు వెళ్ళాను. మొదటి ఆట సినిమా చూసి ఒక మిత్రుడింటికి వెళ్ళాను పడుకుందామని. ఆ ఇంట్లో అతడూ, అతని పినతండ్రి మాత్రం వుంటూ వుండేవారు. నేను వెళ్ళేటప్పటికి తలుపు వేసివుంది. కొట్టాను.

లోపలనుంచి "ఎవరు?" అన్నారు.

నేను మిత్రుడేకదా అని "తియ్యవోయ్ ఎవరైతేనేం?" అన్నాను.

"ఎవరైతేనేం అంటున్నావా? అయితే తియ్యను" అన్నమాట వినిపించింది.

"అట్టే బడాయి పోక తలుపు తియ్యి వెంటనే. అలా భయపడతావేం. నిన్ను ఎత్తుకుపోవడానికి రాలేదెవరు" అన్నాను.

"చెపుతుంటే ఏమిటా జాణతనం?" అంటూ తలుపు తీశారు. తలుపు దగ్గర ఒక ఇరవై యేళ్ళ ఆవిడ, వెనుక ఒక ముసలమ్మ వున్నారు.

వాళ్ళను చూసేటప్పటికి కొంచెం భయం వేసింది. వెంటనే "ఇంట్లో రాఘవుడు లేడుటండీ" అన్నాను.

"ఇక్కడ రాఘవ ఎవడూ లేడు. అసలు ఎవరు నువ్వు?" అన్నారు.

"వాడి స్నేహితుణ్ణండీ. ఉన్నాడని వచ్చాను" అన్నాను నీళ్ళు నములుతూ.

"వస్తే మెల్లగా అడగాలిగానీ బయటనుంచి ఆ పిచ్చికూతలేమిటి? పో అవతలికి. మా అబ్బాయి లేడు. ఉంటే నీ పని అయ్యేది" అందా ముసలమ్మ.

అక్కడనుంచి మెల్లగా పలాయనం చిత్తగించాను. తరువాత తెలిసింది మా రాఘువ వాళ్ళు ఇల్లు ఖాళీచేశారని. వాళ్ళు వచ్చి చేరారని.

ఒక్కొక్కప్పుడు ఎంతో ధీమాతో ఇలాంటి పొరపాట్లు చేస్తూ వుంటాం. ఇలాంటి పొరపాటునుంచే ఒక మిత్రుడు మంచి కథ వ్రాశాడు. అది ఈసారి వర్ణిస్తా.

Post your comments